రెడ్డిప్రసాద్‌ను అభినందించిన ప్రసాద్‌బాబు

ప్రసాద్‌బాబుతో రెడ్డి ప్రసాద్

ప్రజాశక్తి - రాయచోటి : జమ్మూ రాష్ట్రంలో ఎంఎ స్టేడియంలో '4వ వైఎస్‌పిఎ నేషనల్ ఛాంపియన్ షిప్'లో మన రాష్ట్ర జట్టు తరపున అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గం రామాపురం మండలం నల్లగుట్టపల్లె బిసి కాలనీకి చెందిన గంప నాగేంద్ర కుమారుడు గంప రెడ్డిప్రసాద్ ఈనెల 11,12, 13వ తేదీల్లో జరిగిన కబడ్డీ పోటీలలో పాల్గొని ప్రథమ స్థానంలో గెలుపొంది గోల్డ్ మెడల్ సాధించాడు. రెడ్డిప్రసాద్ రాయచోటి గాలివీడు రోడ్డులోని టిడిపి కార్యాలయంలో తన అభిమాన నాయకుడు రాష్ట్ర టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్ బాబును కలిసి తను సాధించిన పతకాన్ని, ప్రసంసపత్రాన్ని చూపించారు. ఈ సందర్భంగా ప్రసాద్ బాబు రెడ్డి ప్రసాద్‌ను అభినందించి శుభాకాంక్షలు తెలియజేసి రాబోయే రోజులలో ఇంటర్నేషనల్ లెవల్లో కబడ్డీ పోటీలలో పాల్గొని మరెన్నో పతకాలు సాధించాలని ఆకాక్షించారు.

ఖర్చులు బారెడు.. మద్దతు జానెడు



వరికి క్వింటాకు రూ.117 మద్దతు ధర పెంపు

గతేడాదితో పోలిస్తే రూ.26 తక్కువ

కేంద్రం మద్దతు ధరపై రైతుల పెదవి విరుపు

ప్రజాశక్తి-చాపాడు

కేంద్ర ప్రభుత్వం ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి, జొన్న, పత్తి సహా 14 రకాల పంటలకు కనీస మద్దతు ధర పెంపునకు ఆమోదం తెలిపింది. తాజా పెంపుతో పలు పంటల మద్దతు ధరలలో గతంలో కంటే ఏమాత్రం ఉపయోగం లేదని రైతులు వాపోతున్నారు. సాగు ఖర్చులు విపరీతంగా పెరిగాయని అందుకు అనుగుణంగా గిట్టుబాటు ధరలు పెరగలేదు. జిల్లాలో వరి ప్రధాన పంటగా ఉంది. ఖరీఫ్, రబీ సీజన్లలో కలిపి మొత్తం 3.20 లక్షల ఎకరాల్లో వరి, ఇతర పంటలు సాగవుతున్నాయి. ఖరీఫ్‌లో 1.56 లక్షల ఎకరాలకు పైగా, రబీలో 60 వేల ఎకరాల్లో వరి పంట పండిస్తున్నారు. రెండు సీజన్లలో కలిపి మొత్తం 6 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం దిగుబడి వస్తోంది. రైతుల సొంత అవసరాలకు పోనూ 4 లక్షల టన్నులకు పైగా ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు అమ్ముతున్నారు.

పెరిగిన పెట్టుబడి ఖర్చులు

పంటల సాగు చేసేందుకు రైతులకు పెట్టుబడి భారీగా పెరిగిపోతోంది. పెరిగిన పంట ఖర్చులు గతేడాదితో పోలిస్తే విపరీతంగా పెరిగాయి. గత ఖరీఫ్ సీజన్‌లో దుక్కులకు రూ.6500 ఉంటే, ప్రస్తుతం రూ.ఏడు వేల వరకు చెల్లిస్తున్నారు. పురుగు మందుల కోసం గతేడాది రూ.2,500 ఖర్చు చేయగా, ప్రస్తుత సంవత్సరంలో రూ.మూడు వేల వరకు పెరిగింది. కూలీల కోసం గత ఖరీఫ్‌లో రూ.7,500 వేలు ఖర్చు చేయగా, ఇప్పుడు రూ.ఎనిమిది వేలు దాటింది. ప్రస్తుతం లీటరు పెట్రోల్ రూ.110.68 ఉండగా డీజిల్ రూ.98.39 ఉందని, గతేడాదితో పోలిస్తే పెట్రోల్, డీజిల్ ధరల్లో పెద్దగా మార్పులు లేకపోయినా పంట కాలంలో వినియోగిస్తున్న యంత్రాల అద్దెలు పెరిగాయంటున్నారు. గతేడాది మాదిరి తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉత్పన్నమైతే, ఈ వ్యయం మరింత పెరిగే అవకాశం ఉంది. కోత మిషన్ అద్దె, పొలం నుంచి ఇళ్లకు ధాన్యం తరలించేందుకు ట్రాక్టర్ల అద్దెలూ పెరగాయని రూ.5,500 నుంచి రూ.6,500 వరకు ఉంటుంది.

ఐదేళ్లలో మద్దతు ధర వివరాలు..

సంవత్సరం	పెంపు (రూ॥లో)	సాధారణ రకం వరి క్వింటాకు (రూ॥లో)
2020-21	53	1968
2021-22	72	1940
2022-23	100	2,040
2023-24	143	2,183
2024-25	117	2,300

గతేడాదితో పోలిస్తే రూ.26 తక్కువ

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరపై రైతులు పెదవివిరుస్తున్నారు. వరికి క్వింటాకు రూ.117 మాత్రమే పెంచి చేతులు దులుపుకుందని గతేడాది రూ.143 పెంచగా, ఈసారి రూ.26 తగ్గించి ధర ప్రకటించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం పెంచిన గిట్టుబాటు ధరలతో (క్వింటాల్) వరి (సాధారణ రకం) రూ.2,300, వరి (గ్రేడ్-ఎ) రూ.2,320, జొన్న (హైబ్రిడ్) రూ.3,371, జొన్న (మాల్దండి) 3,421, సజ్జలు రూ.2,625, రాగులు 4,290, మొక్కజొన్న రూ.2,225, వేరుశనగ 6,783, పొద్దుతిరుగుడు విత్తనాలు రూ.7280, నువ్వులు రూ.9,267, సోయాబీన్ (పసుపు) 4,892, పెసలు రూ.8,682, పత్తి (మధ్యరకం) రూ.7,121, పత్తి (లాంగ్ స్టెపెల్) రూ.7,521, కంది రూ.7,550, మినుము రూ.7,400కి మాత్రమే చేరాయి. కేంద్ర ప్రభుత్వం ఒకవైపు ఎరువులు, విత్తనాలపై రాయితీ క్రమేణా ఎత్తేస్తోంది. పంట ఖర్చులు పెరిగిన నేపథ్యంలో మద్దతు ధరపై ఆశలు పెట్టుకున్న అన్నదాతలకు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రైతులను తీవ్ర నిరాశకు గురి చేసింది.

తగ్గుతున్న సాగు విస్తీర్ణం

గత ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులతో సాగు గణనీయంగా తగ్గినది. ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగును మరింత పెంచాలని ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో పులివెందుల, మైదుకూరు, కమలాపురం, జమ్మలమడుగు తదితర ప్రాంతాలలో వేరుశనగ, వరి, శనగ తదితర పంటలు సాగు చేస్తారు. మైదుకూరు, ప్రొద్దుటూరు, కమలా పురం, బద్వేలు, కడప తదితర ప్రాంతాల్లో వరితో పాటు పసుపు, మిరప, పత్తి, మొక్క జొన్న, సజ్జ తదితర పంటలను సాగు చేస్తారు. రాజంపేట, రైల్వేకోడూరు ప్రాంతాల్లో పండ్ల తోటలతోపాటు వరి, చెరుకు, మామిడి, వేరుశనగ, సన్‌ఫ్లవర్, ఇతర కూరగాయల పంటలు విరివిగా సాగు చేస్తారు. 2019 ఖరీఫ్‌లో 73,792 హెక్టా ర్లలో పంటలు సాగు కాగా, 2020 ఖరీఫ్‌లో 1,10,127 హెక్టార్లలో, 2021-22 ఏడాదుల్లో 1,24, 000 హెక్టార్లలో పంటలు సాగ య్యాయి. 2023లో సాగు గణనీయంగా తగ్గినది. 70 వేల హెక్టార్లకే పరిమితం అయినది.

అధికమవుతున్న సాగు ఖర్చులు

పసుపు పంట సాగుకు ఎకరాకు రూ.1.20 లక్షల నుంచి రూ.1.70 లక్షల వరకు ఖర్చు అవుతుంది. దిగుబడి మాత్రం 30 నుంచి 35 క్వింటాళ్లు మాత్రమే వస్తుంది.. దుక్కిళ్ళ సమయంలో ధరలు నామమాత్రంగా ఉన్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధరలకు సాగు ఖర్చులు కూడా రావు. రూ.12 వేలకు పైగా పసుపు పంటకు ధరలు ఉంటే ఖర్చులు పోను కాస్త మిగులుతుంది .ప్రభుత్వం పసుపు పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి.

- రామసుబ్బారెడ్డి, పసుపు రైతు, సీతారామపురం.

ధరల్లో నిలకడ ఉండడం లేదు

వంటలు సాగు చేసి అమ్మకాలు చేసే సందర్భంలో ధరలు తక్కువగా ఉంటున్నాయి. రైతులు పూర్తిగా అమ్మకాలు చేపట్టిన తర్వాత ధరలు అమాంతం పెరు గుతున్నాయి. ప్రభుత్వం సరైన గిట్టుబాటు ధర కల్పించి, అది అమలు అయ్యేలా చూస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. వరి ధాన్యం గత ఏడాది నూర్పిడి సమయంలో 8 బస్తాల ధర రూ.12 వేలు ఉంటే ప్రస్తుతం రూ.20 వేలకు పైగా ధరలు పెరిగాయి. తీరా రైతులు అమ్మకాలు చేసే సందర్భంలో తిరిగి తగ్గుముఖం పడుతున్నాయి. ఇలాంటి వ్యత్యాసం లేకుండా గిట్టుబాటు ధరలు కల్పించాలి.

- అబ్బిరెడ్డి, వరి రైతు, బద్రిపల్లి.

గిట్టుబాటు ధరలకు చట్టబద్ధత కల్పించాలి

ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఖరీఫ్, రబీ సీజన్‌లలో గిట్టుబాటు ధరలను ప్రకటిస్తూ చేతులు దులుపుకుంటున్నది. దీని ద్వారా రైతులకు ఎలాంటి ఉపయోగం లేదు. గిట్టుబాటు ధర కేవలం కాగితాలకే పరిమితం అవుతున్నది. ప్రభుత్వం గిట్టుబాటు ధరను పార్లమెంటులో చట్టబద్ధత కల్పిస్తే అందుకు అనుగుణంగా రైతులకు గిట్టుబాటు ధర వస్తుంది లేదంటే వ్యాపారాలు ఇష్టానుసారంగా కొనుగోలు చేపడుతారు. ప్రకటనల ద్వారా రైతులకు ఎలాంటి ఉపయోగం లేదు.

- దస్తగిరిరెడ్డి, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి, కడప.

వరి బస్తాలను లారీలోకి ఎక్కిస్తున్న కూలీలు (ఫైల్‌ఫొటో)

కేంద్ర ప్రభుత్వ వైఫల్యంతోనే

నీట్ పరీక్ష పత్రాలు లీకేజీ

- ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎస్.నరసింహ

రాయచోటి : నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

కేంద్ర ప్రభుత్వ వైఫల్యం ద్వారానే నీట్ పరీక్ష పత్రాలు లీకేజీ అయిం దని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి నరసింహ అన్నారు. గురువారం పట్టణంలోని స్థానిక ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల ఎదురుగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా వైద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ పరీక్షలో పెద్ద ఎత్తున అక్రమాలు, అవకతవకలు జరిగా యని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయన్నారు. లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడటానికే నిర్ణయించుకుందని తెలిపారు. కొన్ని రోజు లుగా నీట్ స్కాంపై అభ్యర్థులు గగ్గోలు పెట్టడంతో పాటు న్యాయస్థానాలను ఆశ్ర యించినా పట్టించుకోని ప్రభుత్వం, చివరికి సుప్రీం కోర్టు కేంద్రానికి, నీట్‌ను నిర్వ హించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ)లకు నోటీసులు జారీ చేశాక ఎట్టకేలకు విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పందించి రెండు చోట్ల అక్రమాలు జరిగినట్లు గుర్తించామని అంగీకరించారు. ఎన్‌టిఎను మెరుగు పర్చాల్సి ఉందని చెప్పుకొచ్చారు. అంతేతప్ప కుంభకోణంపై విచారణ జరిపిస్తా మనికాని, అభ్యర్థులకు ఏవిధమైన న్యాయం చేస్తామనికాని తెలపలేదని పేర్కొ న్నారు. నీట్‌లో అక్రమాలు అవేవో సాధారణంగా చోటు చేసుకున్న చిన్న తప్పు లన్నట్లు పేర్కొన్నారు. తప్ప పశ్చాత్తాపం వ్యక్తీకరించలేదని తెలిపారు. మంత్రి నుంచి ఇన్నాళ్లకు వెలువడిన పేలవమైన స్పందన బట్టి నీట్ స్కాంను మోడీ ప్రభుత్వం తుంగలో తొక్కేందుకు తయారుగా ఉందని అర్థమవుతుందన్నారు. నీట్‌లో అవకతవకలే జరగలేదని కేంద్రం చెబుతూ వచ్చిందని బిజెపి ఏలుబడిలోని గుజరాత్‌లో అవకతకలు జరిగాయని పోలీసులు ఎఫ్‌ఐఆర్ నమోదు చేయడంతో ఒక్కసారిగా అక్రమాల పుట్ట పగిలినట్లయిందని తెలిపారు. గతంలో మధ్యప్రదేశ్‌లో శివరాజ్‌సింగ్ ప్రభుత్వంలో ఉద్యోగాల నియామకాల్లో జరిగిన వ్యాపం కుంభకోణం గుర్తుకొస్తోందని తెలిపారు. కోర్టుల్లో విచారణ సందర్భంగా వెల్లడవుతున్న నీట్ అక్రమాలు అందరినీ నివ్వెరపరుస్తున్నాయని తెలిపారు. 67 మంది అభ్యర్థులకు 720 మార్కులు రావడం, వారిలో హర్యా నాకు చెందిన ఒకే పరీక్షా కేంద్రానికి చెందిన అరుగురు ఉండడం, ఒఎంఆర్ షీట్లలో ఒక విధంగా స్కోరింగ్ కార్డుల్లో మరొక విధంగా మార్కులొచ్చి అనూహ్యమైన రీతిలో కటాఫ్ మార్కులు, సగటు మార్కులు పెరిగాయని నిష్పక్ష పాతంగా సమగ్ర దర్యాప్తు జరిపిస్తే మరెన్నో అక్రమాలు వెలుగు చూడొచ్చునని పేర్కొన్నారు. వైద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం దేశ వ్యాప్తంగా ఒకే ఎంట్రన్స్ టెస్ట్ ఉండాలంటూ నేషనల్ మెడికల్ కౌన్సిల్ యాక్ట్‌ను 2019లో మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్)ను ప్రవేశపెట్టి భిన్నత్వం ఏకత్వం కలిగిన భారతదేశంలో నీట్ సరైనది కాదని పలు రాష్ట్రాలు అభ్యంతరం పెట్టాయని పేర్కొన్నారు. సామాజిక న్యాయానికి, అభ్యర్థులకు, పేదలకు, గ్రామీణ విద్యార్థులకు నష్టమన్న ఆందోళనలు బలంగా వ్యక్తమయ్యాయని తెలిపారు. మోడీ ప్రభుత్వం ఇప్పటికైనా సర్వోన్నత న్యాయ స్థానానికి నిజం చెప్పి సమగ్ర దర్యాప్తునకు ముందుకు రావడం బాధ్యత అనిపించుకుటుందని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామానుజలు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మదన్ మోహన్‌రెడ్డి, గణేష్, సమీర్, మౌలా, విద్యార్థులు పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్:** నీట్ పరీక్షపై జరుగుతున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని, ఎన్‌టిఎను రద్దు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు రమణ డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష మళ్లీ నిర్వహించాలని కోరుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు నిరసన తెలి పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్య కేంద్రీకరణలో భాగంగా నీట్ పరీక్షను తీసుకువచ్చి విద్య ప్రయివేటీకరణ చేస్తుందని విమర్శించారు. దేశం మొత్తం ఒకే పరీక్ష ఉండాలని విద్యార్థులపై ఒత్తిడిని పెంచిందని, రాష్ట్రాల హక్కులను కలరాయడమే అవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు యుగంధర్, సురేష్, శంకర, రామ్ పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో మెలగాలి : జడ్జి

జడ్జి శంకర్‌ను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

ప్రజాశక్తి రాయచోటి

ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో మెలగాలని రాజంపేట స్పెషల్ జ్యుడీషియల్ రెండవ కోర్టు మెజిస్ట్రేట్ పి.శంకర్ పేర్కొన్నారు. గురువారం శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం పాలిటెక్నిక్ విద్యార్థుల కోసం ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణ అంకితభావంతో తరగతి గదిలోని పాఠాలను ప్రయోగశాలల యందు నిర్ధారించుకొని తరగతి పాఠ్యాంశాలపై పూర్తి అవగాహనతో అభ్యసించాలని పేర్కొన్నారు. కమ్యూనికేషన్ స్మార్ట్ స్కిల్స్ పై పట్టు సాధించి అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. సాయి విద్యాసంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ పదో తరగతి తర్వాత విద్యార్థి వేసే ప్రతి అడుగు ఎంతో కీలకమైందని, అదే భవిష్యత్తుకు దిశా నిర్దేశం చేస్తుందని అభిప్రాయపడ్డారు. పది తరువాత పాలిటెక్నిక్ కోర్స్ లో చేరి పూర్తి చేసుకుంటే చిన్న వయసులోనే ఉద్యోగం, ఉన్నత విద్య అవకాశాలు సొంతం చేసుకునే వీలుందని పేర్కొన్నారు. వీటిని పూర్తి చేసిన తరువాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాలకు పోటీ పడవచ్చు అని సూచించారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలైన రైల్వే , ఆర్మీ, గెయిల్, ఒఎన్‌జిసి, డిఆర్‌డిఒ, బెల్, మహారత్న, నవరత్న, సింగరేణి వంటి సంస్థలలో రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించి రోడ్, బిల్డింగ్స్, పంచాయతీ, ఇరిగేషన్, మున్సిపాలిటీ వంటి సంస్థలలో ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చు కోవచ్చని వివరించారు. ప్రయివేట్ రంగంలో కన్స్ట్రక్షన్, ఆటోమొబైల్స్, పవర్ ప్లాంట్, మ్యానుఫ్యాక్చరింగ్, కమ్యూనికేషన్స్ రంగాల్లో విస్తృతమైన అవకాశాలను అందిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు డాక్టర్ ఆంజనేయులు మాట్లాడుతూ 23 సంవత్సరాల నుంచి శ్రీసాయి ఇంజినీరింగ్ కళాశాల ఎంతోమంది రూరల్ ఏరియా విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించి ఉజ్వల భవిష్యత్తును కల్పించిందని అభిప్రాయపడ్డారు. పాలిటెక్నిక్ కళాశాల ఇన్‌ఛార్జి వి.ప్రతాపరావు మాట్లాడుతూ రాయచోటి పరిసర మండల కేంద్రాల పరిధి నుంచి బస్సు సౌకర్యం కల్పిస్తుందని, వివిధ పోటీ పరీక్షలకు అవసరమయ్యే అర్థమెటిక్ రీజనింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్ వంటి అంశాలపై ప్రత్యేక శిక్షణ కల్పిస్తున్నామని, చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.బాలాజీ, వివిధ విభాగాధిపతులు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలి

- డిఆర్ఒ సత్యనారాయణరావు

ప్రజాశక్తి - రాయచోటి

ప్రజా సమస్యలు పరిష్కరించడంలో రెవెన్యూ యంత్రాంగం ఎల్లప్పుడూ ముందుండాలని డిఆర్ఒ సత్యనారాయణరావు పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో రెవెన్యూ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వచ్చే అర్జీలపై రెవెన్యూ అధికారులు సిబ్బంది వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రజా సమస్యలు ఎప్పుడైతే తగ్గుతాయో ఆరోజు రెవెన్యూ వ్యవస్థ పూర్తి స్థాయిలో పనిచేసినట్లని చెప్పారు. అన్నమయ్య జిల్లాలోని రెవెన్యూ అధికారులందరూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడూ పరిష్కరించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. డిప్యూటీ తహశీల్దార్ నరసింహ కుమార్ మాట్లాడుతూ జిఒ నెంబర్ 81ని తీసుకవచ్చి జూన్ 20న రెవెన్యూ డేగా నిర్వహించుకోవడానికి కృషి చేసిన బొప్పరాజు వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రెసిడెంట్ ఏపీ ఆర్ ఎస్ ఏ జనరల్ సెక్రటరీ రమేష్‌లకు జిల్లా రెవెన్యూ సిబ్బంది తరపున కృతజ్ఞతలు తెలిపారు. 1953లో మొదలై ప్రజలకు అందుబాటులో ఉంటూ వారితో మమేకమై వారి కోసం పని చేసే వ్యవస్థ రెవెన్యూ అన్నారు. కోడి కూయక మునుపే నిద్రలేచి చిమ్మ చీకటి వరకు ప్రజాసేవకే పని చేసే వారే రెవెన్యూ ఉద్యోగులని, జనన, మరణ, కుల ధ్రువీకారణ, రైతుల భూముల గణంకాలు నిర్వహిస్తూ పనిచేసే వ్యవస్థ తహశీల్దార్ వ్యవస్థ అని గుర్తుచేశారు. ప్రజా సమస్యల పరిస్కార వేదికలో వచ్చే సమస్యలపై రెవెన్యూ మరింత మెరుగ్గా పనిచేసి వచ్చే రెవెన్యూ డే లోగా ప్రజా సమస్యల శాతాన్ని పూర్తిగా తగ్గే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖలో ఉత్తమసేవలు అందించిన పలువురు విశ్రాంత ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఎఒ గోవిందు, గ్రామ, మండల, జిల్లా రెవిన్యూ అధికారులు, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగిని సన్మానిస్తున్న డిఆర్ఒ, ఇతర అధికారులు

రాస్తారోకో చేస్తున్న చేనేత కార్మికులు

బాధ్యులను కఠినంగా శిక్షించాలి

- జాతీయ రహదారిపై రాస్తారోకోలో చేనేతలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె నీరుగట్టువారిపల్లె చెందిన చేనేత కార్మికుడు రామిశెట్టి రమేష్ బాబు (50) కురబలకోట మండలం అంగళ్లులోని మల్లయ్యకొండలో సూసైడ్ నోట్ రాసి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. తొలుత అప్పులబాధతో ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు చెప్పారు. స్థల వివాదంతోనే రమేష్ బాబు ఆత్మహత్య చేసుకున్నట్లు చేనేత కార్మికులు ఆరోపిస్తూ గురువారం జిల్లా ఆస్పత్రి ఎదుట జాతీయ రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రమేష్ బాబు రెండేళ్ల కిందట స్థానిక కాట్లాటపల్లె రోడ్డులోని సర్వే నంబర్ 605లో ఉన్న వెంకటేష్, చంద్ర, శివారెడ్డి వద్ద చెందిన ఒకటిన్నర కుంట స్థలాన్ని రూ.10.5 లక్షలకు కొనుగోలు చేశాడని తెలిపారు. ఆ స్థలం తమదేనంటూ నీరుగట్టువారిపల్లెకు చెందిన పురాణం చంద్రశేఖర్, తమ్ముడు పురాణం రత్నం, ఇతని బంధువులు ప్రసాద్, శ్రీకాంత్, అభ్యంతరం వ్యక్తం చేశారని చెప్పారు. పైగా ఆ స్థలంలోకి రమేష్ బాబును వెళ్లనీయకుండా తరచూ గొడవపడుతూ వేధిస్తున్నారన్నారు. స్థలం అమ్మిన చంద్ర, వెంకటేష్, శివారెడ్డి సమస్యను పరిష్కరించలేదని తెలిపారు. ఈ క్రమంలో వీరి వేధింపులు భరించలేని రమేష్ బాబు మల్లయ్యకొండలో ఆత్మహత్య చేసుకున్నాడని పేర్కొన్నారు. ఈ ఏడుగురి కారణంగానే చేనేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడని, సహచర కార్మికులు ఆరోపిస్తూ జాతీయ రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఒకటిన్నర కుంట స్థలాన్ని రమేష్ బాబు కుటుంబానికి అప్పగించాలని స్పష్టం చేశారు. మరో 11 మంది నేత కార్మికులు అదే స్థలాన్ని కొనుగోలు చేశారన్నారు. పురాణం చంద్రశేఖర్, రత్నం, శ్రీకాంత్, ప్రసాద్ మిలటరీ కోటా కింద కేటాయించినట్లు ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించి స్థలాన్ని ఆక్రమించుకున్నారని ఆరోపించారు. వివాదానికి కారణమై పలువురి పొట్ట కొడుతున్న ఆ స్థలాన్ని పూర్తి స్థాయిలో పరిశీలన చేసి నిజ నిజాలను నిర్ధారించాలని డిమాండ్ చేశారు. ఆందోళనకారులతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వన్ టౌన్ పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళనకారులకు సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది. ఈ మేరకు కేసుదర్యాప్తు చేస్తున్నట్లు ముదివేడు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి చెప్పారు.

పింఛను పెంపు హర్షణీయం

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి మదనపల్లె అర్బన్

విభిన్నప్రతిభావంతులకు పింఛను రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పెంచడంపై గురువారం విహెచ్‌పిఎస్ చెవిటి మూగ సంఘం సభ్యులు, ఎంఆర్‌పిఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పింఛను పెంపు కోసం పోరాడిన ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా చిత్ర పటాలకు పూలు జల్లి, పాలభిషేకం చేసి, స్వీట్స్ పంచి పెట్టారు. విహెచ్‌పిఎస్ మాజీ జిల్లా అధ్యక్షులు షేక్ మౌలాలి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఎస్‌పి జాతీయ నాయకులు నరేంద్ర బాబు మాదిగ, మౌలాలి, ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు రవి మాట్లాడుతూ విభిన్నప్రతిభావంతులకు పింఛను పెంపు కోసం మందకృష్ణ అలుపెరుగని పోరాటం చేశారన్నారు. ధరలు పెరిగిన నేపథ్యంలో ఇప్పుడిస్తున పింఛను రూ.3 వేలు చాలదని, రూ.6 వేలు ఇవ్వాలని చేసిన పోరాటాన్ని ఇప్పుడొచ్చిన ప్రభుత్వం మానవీయ కోణంలో అర్థం చేసుకుందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని నెరవేరుస్తూ పింఛను రూ.6 వేలకు పెంచడం పట్ల యావత్ వికలాంగుల సమాజం వీరి పట్ల కృతజ్ఞతగా ఉంటుందని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని వికలాంగుల సమస్యల పరిష్కారానికై చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారాలను సాధిస్తామని తెలిపారు. విహెచ్‌పిఎస్ గ్రామ, మండల, జిల్లా స్థాయి నిర్మాణాలను పూర్తి చేసి, వికలాంగులను ఒక బలమైన శక్తిగా మారుస్తామని తెలిపారు. కార్యక్రమంలో విహెచ్ పిఎస్, చెవిటి మూగ సంఘం నాయకులు చంద్ర, సునీల్, రాజు, సుబ్రహ్మణ్యం, వెంకటేష్, మధు కుమార్, పప్పిరెడ్డి, రమణ, కిరణ్, పద్మనాభం, చంద్రశేఖర్, ఎంఎస్‌పి నాయకులు ఆరేటి మోహన్, కో-ఇన్‌ఛార్జి మొపూరి మనోహర్, ఎంఆర్‌పిఎస్ నాయకులు రమణ క్రిష్, నాగ, నాగరాజు పాల్గొన్నారు.

బాడీ ఫ్రీజర్‌ను అందిస్తున్న సీతారామయ్య

బాడీ ఫ్రీజర్ వితరణ

ప్రజాశక్తి -నందలూరు

మండల ప్రజల అవసరార్థం, మరణించిన వారి కోసం బాడీ ఫ్రీజర్‌ను మండెం సీతారామయ్య గౌడ్ తన సొంత నిధులతో గురువారం మానవత సేవా సంస్థ మరియు లయన్స్ అండ్ వాకర్స్ క్లబ్ సభ్యులకు బాడీ ఫ్రీజర్ బాక్స్‌ను వితరణగా అందించారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు మండెం సీతారామయ్య గౌడ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్యఅతిథిగా హాజరైన లయన్స్ క్లబ్ మన్నెం రామమోహన్ మాట్లాడుతూ దాత సీతారామయ్య గౌడ్‌ను అభినందిస్తూ ఇటు వంటి సేవా కార్యక్రమాలు చేయడానికి మరింత మంది ముందుకు రావాలని సూచించారు. పేద ప్రజల అవసరాలు తీర్చడానికి దోహదపడే కార్యక్ర మాలను చేయాలని ఆకాంక్షించారు. కార్య క్రమంలో లయన్ సుబ్రమణ్యంయాదవ్, మోడపోతుల రాము, ఆనాల మధుయాదవ్, గుణయాదవ్, రామచంద్రయ్య, గంధం గంగాధర్, కాసర్ల వెంకయ్య, శ్యామసుబ్బయ్య గురు ప్రసాద్, కొత్తపల్లి రాజాచారి, రామ్మోహన్ రెడ్డి, పుత్తా వెంకటేష్, గుండు సురేష్ పాల్గొన్నారు.

30 వరకు దరఖాస్తుల గడువు పొడిగింపు

ప్రజాశక్తి-కలికిరి

అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రవేశానికి గడువు జూన్ 30 వరకు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజేష్ తెలిపారు. ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవి ద్యాలయం వారు 2024-25 విద్యా సంవత్సరానికి గాను పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు రెండు లేదా మూడు సంవ త్సరాల డిప్లొమా (డిప్లొమా ఇన్ అగ్రికల్చర్, డిప్లొమా ఇన్ సీడ్ టెక్నాలజీ, డిప్లొమా ఇన్ ఆర్గానిక్ అగ్రికల్చర్, డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖా స్తుల గడువు చివర తేదీ జూన్ 30 వరకు పొడిగించినట్లు తెలిపారు. ఈనెల 30 తేది లోపు www.angrau.ac.in వెబ్‌సైట్‌లో దర ఖాస్తు చేసుకో వాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తులు, అడ్మిషన్ ప్రోసెస్, కౌన్సెలింగ్ తేదీలు, తదితర వివరాలు కొరకు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ www. angrau.ac.in సంద ర్శించాలని కోరారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, ఇతర వివరాల కొరకు మొబైల్ నెంబర్ 8008104977ను సంప్రదించాలని తెలిపారు.

ఎంపిడిఒకు వినతిపత్రం అందిస్తున్న జనసేన నాయకులు

ప్రజా సమస్యలపై దృష్టి సారించండి

ప్రజాశక్తి-మొలకలచెరువు

తంబళ్లపల్లె నియోజకవర్గంలో నిష్పక్షపాతంగా ప్రజల సమస్యల పరిష్కారంలో అధికార యంత్రాంగం పూర్తి సహకారం అందించాలని తంబళ్లపల్లె జనసేన పార్టీ ఇన్‌ఛార్జి పోతుల సాయినాథ్ అధికారులను కోరారు. గురువారం ఆయన పెద్ద తిప్పసముద్రం, బి కొత్తకోట, తంబళ్లపల్లె ఎంపిడిఒలతో గతంలో జరిగిన అభివృద్ధి పనులపై వివరాలు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా సాయి నాథ్ మాట్లాడుతూ గతంలో వైసిపి ప్రభుత్వంలో ఏకపక్ష నిర్ణయాలు జరిగా యని అన్నారు. ప్రజలకు సమన్యాయం చేయడమే కూటమి లక్ష్యమని అన్నారు. నియో జకవర్గంలో గతంలో వైసిపి ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేసిన వారిపై నిఘా ఉంచామని త్వరలో ప్రక్షాళన చేసి నిజాయితీగా ప్రజల సేవ చేసే అధికారు లకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు అనంతరం ఐకెపి, ఉపాధి హామీ కార్యాలయాలను సందర్శించారు. కార్యక్రమంలో యువత గంగరాజు, నరసిం హులు, సోమశేఖర్, మ్యూజికల్ శివ, జయరాం రెడ్డి, బేరి శ్రీనివాసులు, అప్పి రెడ్డి, కాలా నారాయణ, వీరాంజనేయులు, జనసేన నాయ కులు నరేందర్ రెడ్డి, మురళి, హరీష్, శంకర్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి- కలకడ

రామానుజులు(ఫైల్ ఫొటో)

అనారోగ్యంతో ఉపాధ్యాయుడు మృతి చెందిన సంఘటన మండ లంలో చోటుచే సుకుంది.మండలంలోని నడిమి చర్ల పంచాయతీ నడిమిచర్లకు చెందిన అనుమల సిద్దయ్య కుమా రుడు అనుమల రామానుజులు(61) కోన పంచా యతీ బంగారు వాండ్ల పల్లెలో స్థానిక ప్రాథ మిక పాఠశాలలో ఉపా ధ్యాయుడిగా విధులు నిర్వహి స్తున్నారు. గత కొద్దికాలంగా శ్వాస కోశ సంబంధ వ్యాధి బాధ పడుతూ బుధవారం సాయంత్రం ఛాతిలో నొప్పి రావడంతో కలకడలోని ప్రయివేట్ వైద్య శాలకు చికిత్స నిమిత్తం తరలించినట్లు తెలిపారు. అక్కడ వైద్యుల పరిశీలించి, గుండె పోటుకు గురై అప్పటికే మృతి చెందారని అన్నా రు. మృతి చెందిన ఉపాధ్యాయుడు రామాం జులుకు భార్య ఇందిరమ్మ ఒక కుమా రుడు, ఇద్దరు కుమారులు ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సంసార బాధ్యతలు నిర్వహించే కుటుంబ యజమాని మృతి చెందడంతో కుటుంబం రోడ్డున పడిందని స్థానికులు తెలిపారు. ఉపాధ్యాయ వృత్తిలో రామా నుజులు మంచి తనానికి మారుపేరుగా మండలంలో పేరు ప్రతిష్టలు తెచ్చుకున్నారని మండల విద్యాశాఖ అధికారులు మునీంద్రనాయక్, రామచం ద్రారెడ్డిలు పేర్కొన్నారు. ఉపా ధ్యాయ వృత్తికి న్యాయం చేస్తూ, విద్యార్థుల పట్ల గౌరవ మర్యా దల సంపా దించుకుని విద్యార్థులకు విద్యతో పాటు క్రమశిక్షణలో నడిపించేందుకు తాను కృషి చేశారని అలాంటి ఉపాధ్యాయుని పో గొట్టుకోవడం బాధాకరమని తెలిపారు. మం డలంలోని ఉపాధ్యాయులు రామానుజులు మృతి పట్ల సంతాపం తెలిపారు.

పేద కుటుంబాలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

పేద కుటుంబాలకు చార్మినార్ హోటల్ ఫయాజ్ అండగా ఉంటూ సొంత నిధులతో గురువారం ఆర్థికసాయం అందించడం హర్షణీయమని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి, రాహుల్ రెడ్డి అన్నారు. కొత్తపల్లి ఏరియాలో పేద కుటుంబంలోని వివాహం కోసం, మరికొన్ని కుటుంబాలకు కుటుంబ పోషణ కోసం ఆర్థిక సాయం అందించారు. ఒకోక్క కుటుంబానికి రూ.50వేల ఆర్థిక సహాయాన్ని టిడిపి పార్టీ శ్రేణుల చేతుల మీదుగా కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద కుటుంబంలో పెళ్లి ఖర్చుల కోసం ఆర్థిక సాయం అందించి మానవత్వాన్ని చాటు కోవడం గొప్ప విషయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీల కోసం దుల్హన్ పథకం ద్వారా లక్ష రూపాయలు ఆర్థిక సాయాన్ని అందిస్తుందని, మైనార్టీలకు అండగా ఉండేది టిడిపి ప్రభుత్వమేని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రమణారెడ్డి, మాజీ మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు సలావుద్దీన్, చెన్నూరు అన్వర్‌బాషా, గోల్డ్ అల్లాబకాష్, బిస్మిల్లా డ్రైవింగ్ స్కూల్ యజమాని బదర్, అతాఉల్లా టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పేదలకు నగదును అందిస్తున్న టిడిపి నాయకులు

కంపు కొడుతున్న కలకడ

- బస్టాండ్ ఆవరణంలో మాంసం వ్యర్థాలు
- దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టని అధికారులు

బస్టాండ్ సర్కిల్లో ఉన్న చికెన్ దుకాణాలు

ప్రజాశక్తి-కలకడ

మండల కేంద్రమైన కలకడ, బాలయ్యగారిపల్లి పంచాయతీలోని ఎర్రయ్యగారిపల్లి పరిసర ప్రాంతాల్లో చికెన్ సెంటర్లు అధికంగా ఉన్నాయి. మందుల షాపులు, ఎరువుల అంగళ్లు, ఆర్‌టిసి బస్టాండ్, స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమీపంలో ఎక్కువగా చికెన్, మటన్ దుకాణాలు ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు సాగిస్తున్నారు. మటన్, చికెన్ సెంటర్లకు ఇరుపక్కల ఉన్న దుకాణాదారులు వాట నుంచి వచ్చే దుర్వాసనతో భరించలేకపోతున్నామని వాపోతున్నారు. చికెన్ సెంటర్ల ద్వారా వచ్చే వ్యర్థ పదార్థాలను నిబంధనలకు విరుద్ధంగా బస్టాండ్ ఆవరణం, అంకాలమ్మ చెరువులో వేస్తుండటంతో అటువైపు వెళ్లాలంటే ముక్కున వేలు వేసుకోక తప్పడం లేదని స్థానికులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటి ద్వారా కంపు వెదజల్లుతూ రోగాలకు నిలయంగా మారుతున్నాయని అన్నారు. అనేక మందికి వివిధ రకాలైన జ్వరాలు, జబ్బుల బారిన పడి ప్రయివేట్ ఆస్పత్రులకు వేలాది రూపాయలు వెచ్చించి నయం చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. మాంసపు దుకాణాల వ్యర్థాలతో ప్రజలు ఇబ్బందులకు గురువుతున్నా పంచాయతీ వారుగానీ, అటు డ్రగ్స్ అండ్ శానిటరీ అధికారులుగానీ ఏ మాత్రం పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారుల సందర్శించి చికెన్, మటన్ సెంటర్‌ల వద్ద వచ్చే వ్యర్థ పదార్థాలను దూరంగా పారవేసి రోగాలబారిన పడకుండా ప్రజలను కాపాడాలని కోరుతున్నారు.

వ్యర్థాలతో నిండిన బస్టాండ్ ఆవరణం

దోమల నివారణపై అవగాహన

అబెట్ ద్రవణాన్ని పిచికారి చేస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి-కలకడ

దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించినట్లు ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కిషోర్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో మలేరియా మాసోత్సవ కార్య క్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ గ్రామంలో నీటి నిలువలు లేకుండా చేసుకోవాలని పాత టైర్లు, పాత కూలర్లు, ప్లాస్టిక్ డబ్బాలు, టెంకాయ బొచ్చ లలో నీరు నిల్వ లేకుండా చేస కోవాలని అన్నారు. సాయంత్రం ఆరు తర్వాత గృహలలో కిటికీలు, తలుపులు మూసు కోవాలని, వేపాకు పొగను ప్రతి ఇంట్లో పొగ పెట్టడం వలన దోమలు పూర్తిగా బయటకు వెళ్లిపోతాయని తెలిపారు. సబ్ యూనిట్ అధికారి షేక్ ముజేబ్ బాషా మాట్లాడుతూ నీటి తొట్టెలు, కొబ్బరి చిప్పలు, వాడిపడేసిన ప్లాస్టిక్ వస్తువులు, నీళ్ల డ్రమ్ములు ఎప్పటికప్పుడు శుభ్రపరచుకోవాలని అన్నారు. దోమ నాలుగు దశలలో తయారవుతుందని గుడ్డు దశ, లార్వా దశ, పీపాదశ, దోమ దశగా ఈ నాలుగు దశలు తయార వుతుందని అన్నారు. విస్తరణ అధికారి జయరామయ్య మాట్లా డుతూ ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే నిర్వహించాలని, లార్వా సర్వే ఫార్మెట్లు పూర్తిచేసి ఇవ్వాలని, ఆబైట్ ద్రావ ణాన్ని పిచికారి చేయాలని రాండ మ్ సర్వే కరెక్ట్‌గా చేయాలని, ఆరోగ్య, ఆశా కార్యకర్తలకు తెలిపారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ షేక్ జమీల్ అహ్మద్, పిహెచ్ఎన్ కె.సుబ్బ రత్నమ్మ, ఫార్మసిస్ట్ షేక్ షరీఫ్‌బాషా, ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వయోజనులకు బిసిజి టీకా తప్పనిసరి

ప్రజాశక్తి-కలికిరి

బిసిజి టీకాతో క్షయ దూరమవుతుందని, ఆరు వర్గాల వారు తప్పనిసరిగా బిసిజి టీకా తీసుకోవాలని హెల్త్ ఎడ్యుకే ఎడ్యుకేటర్ మహమ్మద్‌రఫీ అన్నారు. క్షయ వ్యాధి లేని సమాజం కొరకే వయోజనులకు టీకాలు ప్రభుత్వం ప్రవేశపెట్టినదని అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఆదే శాల మేరకు మెడికుర్తి వైద్యులు డాక్టర్ చిన్నరెడ్డెప్ప ఆధ్వర్యంలో గురువారం మండలంలోని బిసిజి టీకా కార్యక్రమాన్ని వారు పర్యవేక్షణ చేశారు. వయోజన టీకా ప్రాముఖ్యతపై అవ గాహన కల్పించారు. గురువారం మండలంలోని ఇందిరమ్మ కాలనీ, మజ్జిగవాండ్లపల్లి, పల్లవలి, గడి గ్రామాల్లో నిర్వ హిస్తు న్న టీకాల కార్యక్రమంలో పాల్గొని పర్యవేక్షణ చేస్తూ, లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. 60 సంవత్సరాలు పైబడిన వారు, షుగర్ వ్యాధి గ్రస్తులు, బీడీ, సిగరెట్ తాగే వారు, టిబి వచ్చి తగ్గిపోయి బాగైన వారు, టిబి రోగితో కలసి ఉండేవారు, ఎత్తుకు తగ్గ బరువు 18 కంటే తక్కువ ఉన్న వారు టీకా తప్పనిసరిగా వేసుకోవాలని తెలిపారు. ఇకపై ప్రతీ సోమ, గురు వారాలలో ఆరోగ్య కేంద్రాల్లో టీకా వేస్తారని తెలిపారు. గడిలోని జిల్లా పరిషత్ ఉన్నత ఉర్దూ పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయులు శ్రీనివాస్‌చ ఖాదర్‌వలి ఆధ్వర్యంలో 9, 10వ తరగతి విద్యార్థులకు బిసిజి టీకా పై అవగాహన కల్పిం చామని తెలిపారు. బిసిజి టీకా సురక్షితమైందని అన్నారు కార్యక్రమంలో పర్య వేక్ష కుల నాగిరెడ్డి, ఎంఎల్‌హెచ్‌పిలు భాను ప్రియ, ఆయేషా, ఎఎన్ఎంలు సరిత, రమాదేవి, మాధవి, ఆశా కార్య కర్తలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

తంబళ్లపల్లి: వృద్ధులకు టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

426 మందికి బిసిజి వ్యాక్సిన్

తంబళ్లపల్లి: మండలంలో కోసవారిపల్లె మెడికల్ ఆఫీసర్ అనుపమ, డాక్టర్ మునికుమార్ ఆధ్వర్యంలో బిసిజి వ్యాక్సిన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.12 హెల్త్ క్లీనిక్‌ల పరిధిలో సుమారు 426 మందికి క్షయ వ్యాధి నివారణకు ముందస్తుగా బిసిజి టీకాలు వేసినట్లు డాక్టర్ తెలిపారు. ఇప్పటివరకు మండలంలో 3,018 మందికి వ్యాక్సిన్ టీకాలు వేసినట్లు పేర్కొన్నారు. అను కున్న లక్ష్యాలను సాధించేందుకు మంగళవారం కూడా ప్రత్యేక క్యాంపు నిర్వ హించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధం

వేరుశనగ విత్తనకాయనాలను సిద్దం చేసుకుంటున్న మహిళా రైతులు

ప్రజాశక్తి-గాలివీడు

ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే వర్షాలు కురుస్తుండటంతో రైతులు ఖరీఫ్ వేరుశనగ పంట సాగు సిద్ధమవుతున్నారు. మండలంలోని 17 గ్రామాలలో ఎర్ర గరప నేలలలో వర్షంపై ఆధారపడి వేరుశనగ పంట సాగు చేసే రైతులు సిద్ధం చేస్తున్నారు. పొలాల్లో ఉన్న చెత్తాచెదారాలను, వ్యర్థాలను తొలగించి దుక్కులు చేసుకొని సిద్ధంగా ఉంచుకున్నారు. ఇక్కడ ఎక్కువ భాగం రైతులు వేరుశనగ పంటను సాగు చేస్తారు. వేరుశనగ పంట సాగులో మండలం మొదటి స్థానంలో ఉంటుంది. 20 సంవత్సరాలకు ముందు మండలంలో పది వేరుశనగ మిల్లులు పనిచేస్తూ ఉండేవి. ఎక్కువ మంది వేరుశనగ పంటపైనే దృష్టి పెట్టి సాగు చేసేవారని, ప్రస్తుతం రాను రాను వ్యవసాయం కుంటు పడడంతో సాగు తగ్గింది. వ్యవసాయంపై దృష్టి పెట్టక కొందరు రైతులు భూములను కౌలుకు ఇవ్వడం, వ్యవసాయం ఖర్చులు అధికం కావడంతో రైతులు వెనుతిరిగి పోతున్నారు. ప్రభుత్వం సబ్సిడీ వేరుశనగ విత్తనపకాయలు మండలానికి మంజూరు చేసినట్లు మండల వ్యవసాయ అధికారి మండే మురళీధర్ పేర్కొన్నారు. 2075 క్వింటాళ్లు కెసి వేషన్ విశాట్ కాయలు రూ.1710లతో 30 కేజీల సంచి రైతులు అందించినట్లు తెలిపారు. 400 క్వింటాళ్ల నారాయణి రకం రూ.1740లతో 30కేజీల బ్యాగులను రైతు భరోసా కేంద్రాల నుంచి రైతులకు నేరుగా అందించినట్లు పేర్కొ న్నారు. ఈ ఏడాది వర్షాలు సకాలంలో కురుస్తుండటంతో వేరుశనగ పంటతో రైతులకు మంచి దిగుబడి వస్తుందని ఆయన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. గ్రామాలు, పల్లెలలో సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలను విత్తేంతుకు మహిళలు సిద్ధం చేసుకుంటున్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని ఎస్‌వివిడి విద్యాసంస్థల్లో ఇటీవల నిర్వహిం చిన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన ఐదుగురు విద్యార్థినిలకు భోగ వెంకటరామయ్య ఆధ్వర్యంలో నగదు ప్రోత్సాహక బహుమతులు గురువారం అందించారు. కె హరిప్రియ, ఎం. ఐశ్వర్య, ఎం.సం కీర్తన, ఎ.హిమబిందు, ఎం.రమ్య అనే విద్యార్థులను నగదును అందించారు. ఈ సందర్భంగా సభ విద్యాసంస్థల అధినేత నూకల శ్రీరా ములు మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహు మ తులు అందించి ప్రోత్సహించడం శుభపరిణామమని పేర్కొన్నారు. రానున్న విద్యా సంవత్సరంలో కూడా విద్యార్థులు బాగా కష్టపడి ఉత్తమ ఫలితాలు సాధించి సభ సంస్థలకు ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసు కురా వాలని విద్యార్థులకు సూచించారు. సుబ్బరామయ్య మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందించడం సంతో షంగా ఉందని అన్నారు. ఉన్నతమైన విద్యను అభ్యసించాలని చదువుకు పేద రికం అడ్డు కాకూడదని తెలిపారు. రానున్న రోజుల్లో ఉన్నత చదువులు అభ్యసించే విద్యార్థులకు ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా ముందుంటామని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి కూడా బాగా చదివి ఉన్నత స్థితికి ఎదిగితే ఉపా ధ్యాయులకు విద్యార్థులు ఇచ్చే బహుమతి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ బాలాజీరాజు, ప్రధానో పాధ్యాయులు, మురళీమోహన్‌రెడ్డి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్న వెంకటరామయ్య

ఇఒపై కలెక్టర్, డిపిఒకు సర్పంచ్ ఫిర్యాదు

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు గ్రామ పంచాయతీలో అధికార దుర్వినియోగానికి పాల్పడిన ఇన్‌ఛార్జి ఇఒ గఫూర్‌పై విచారణ జరపాలని సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్ బాష కలెక్టర్, డిపిఒలకు ఫిర్యాదు చేశారు. గురువారం ఆయన జిల్లా కేంద్రంలో కలెక్టర్, డిపిఒలను కలిసి పీలేరు పంచాయతీ ఇన్‌ఛార్జి ఇఒ స్థానిక ఓ ప్రయివేట్ ఆసుపత్రి వైద్యుడిని మభ్యపెట్టి సెలవులో ఉన్న తనకు మతిస్థిమితం సరిగ్గా లేదంటూ పత్రాలు తయారు చేయించి, ఎంపిడిఒకు ఫిర్యాదు చేశారంటూ ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యాలయంలోని రికార్డులను తారుమారు చేస్తున్నట్లు కూడా ఫిర్యాదు ద్వారా జిల్లా పరిపాలనాధికారి, గ్రామ పంచాయతీల అధికారికి విన్నవించినట్లు తెలియజేశారు. అధికారులు ఇన్‌ఛార్జి ఇఒపై చర్యలు చేపట్టాలని కోరారు.

కేంద్ర మంత్రిని కలిసిన 'యల్లటూరు'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన భూపతిరాజు శ్రీనివాస వర్మను గురువారం హైదరాబాద్‌లో జనసేన పార్టీ రాజంపేట పార్లమెంటు ఇన్‌ఛార్జి యల్లటూరు శ్రీనివాసరాజు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఆయనకు అభినందనలు తెలిపారు.

గ్రామ సచివాలయంలో చిత్రపటాలను ఏర్పాటు చేస్తున్న టిడిపి నాయకులు

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

రాష్ట్రంలో ప్రస్తుతం కూటమి ప్రభుత్వంతోనే అభి. వృద్ధి సాధ్యమ వుతుందని రాజంపేట పార్లమెంటరీ టిడిపి అధి కార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్ అన్నారు. గురువారం టిడిపి మండల అధ్యక్షులు పుర్రా వెంకటరమణ, గ్రామ కమిటీ నాయ కులతో కలసి రాచవేటివారిపల్లె గ్రామ సచివా లయంలో చంద్ర బాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా చిత్రపటాలను సర్పంచ్ సుబ్రమణ్యంకు అందజేసి ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ గ్రామ స్వరాజ్యం గ్రామ సచివాలయ పాలన తోనే సాధ్య మవుతుందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిపాలనలో చాణుక్యుడని, రానున్న ఐదు సంవత్సరాలలో ప్రజలకు ప్రతి అవస రాలను తీర్చుతూ సూపరిపాలన అందించ గలరని ఆశాభావం వ్యక్తం చేశారు. టిడిపి కార్యకర్తలు క్రమశి క్షణకు మారుపేరని అన్నారు. గెలుపోటములు సహజమని, కక్ష సాధింపు చర్యలకు పోకుండా అధికారులతో, ప్రజా ప్రతి నిధు లతో, ప్రజలతో కలసి మెలసి ఉంటూ ప్రజా సమస్యలను సత్వ రమే పరిష్కరిం చాలని అన్నారు. కూటమి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావడానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మల్లికార్జున, మనోహర్ రెడ్డి, నరసిం హారెడ్డి, భద్ర, వెంకటరమణ, రాజశేఖర్, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

మండలానికి మోడల్ స్కూల్ లేనట్లేనా?

ప్రజాశక్తి-గాలివీడు

2013 సంవత్సరంలో రాష్ట్రంలో అన్ని జిల్లాలలోని ప్రతి మండల కేంద్రంలో ఎపి మోడల్ స్కూల్‌ను ప్రారంభిం చారు. గాలివీడు మండల కేంద్రం లో ఏర్పాటు చేయకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. ఉచితంగా ఇంటర్మీడియట్ వరకు చదువుకొనే అవకాశం తమకు లేకుండా పోయిందని విద్యార్థులు పేర్కొంటున్నారు. జిల్లాకు చెందిన మండిపల్లి రాం ప్రసాద్‌రెడ్డికి మంత్రి పదవి దక్కడంతో ఆయన ద్వారానైనా మండల కేంద్రా నికి మోడల్ స్కూల్ వచ్చే అవకాశాలు ఉన్నాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తు న్నారు. మంత్రి దృష్టి పెట్టి మోడల్‌స్కూల్ ఏర్పాటు కృషి చేయాలని కోరారు.

రిటైర్డ్ విఆర్‌ఒ గంగులప్ప, గ్రామసేవలను సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఘనంగా రెవెన్యూ దినోత్సవం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవాన్ని గురు వారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ బ్రహ్మయ్య మాట్లా డుతూ రెవెన్యూ సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు. అప్పుడే రెవెన్యూ ఉద్యోగులకు అధికారులకు మంచి పేరు వస్తుందన్నారు. అనం తరం రిటైర్డ్ విఆర్‌ఒ గంగులప్ప, సీనియర్ గ్రామ సేవకులు ప్రసాద్‌లను శాలు వాలతో సత్కరించారు. రెవెన్యూ శాఖ అధికారులు ఉద్యోగులు ప్రజలకు అందు బాటులో ఉండి సమస్యలు పరిష్కరించి రెవెన్యూ శాఖకు ఒక ప్రత్యేక గుర్తింపు తేవాలని కోరారు. కార్యక్రమంలో డిటి మౌలాలి, విఆర్‌ఒలు, విఆర్ఎలు, రెవెన్యూ కార్యా లయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కౌన్సిలర్లపై దాడి దురదృష్టకరం

-వైసిపి అన్నమయ్య జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రాయచోటిలో వైఎస్ఆర్ సిపి కౌన్సిలర్లపైన దాడి చేయడం దురదృ ష్టకరమని ఆ పార్టీ రాయచోటి అన్నమయ్య జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రశాంత వాతావరణానికి అలవాటుపడ్డ రాయచోటి ప్రజలకు ఈ రకమైన దాడులు చేసి భయాందోళనలకు గురిచేయడం సరైన పద్ధతి కాదన్నారు.బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు ఇలాంటి ఘటనలు జరగనీయకుండా చూడాల్సిన అవసరముందన్నారు. అధికారమనేది ఎవ్వరికీ శాశ్వతం కాదన్నారు. మున్సిపల్ 4 వ వార్డు కౌన్సిలర్ కొలిమి హారూన్ బాషా ఇంటి పైకి వచ్చి దాడికి దిగి, భయభ్రాంతులకుగురిచేయడం, వారి వాహ నాన్ని ధ్వంసం చేయడం అరాచక చర్యగా అభివర్ణించారు. అలాగే 7వ వార్డు కౌన్సిలర్ భర్త ఇర్ఫాన్‌ను కత్తితో పొడిచి తీవ్రంగా గాయ పరచడం హేయ నీయమన్నారు. కత్తిపోట్లకు గురైన ఇర్ఫాన్ ప్రస్తుతం కడపలో చికిత్స పొందుతున్నారన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసింది తానే అని, తనపై కక్ష తీర్చు కోవాలన్న భావన ఉన్న వారు నేరుగా తననే దాడి చేయాలని నాయకులు, కార్యకర్తల జోలికి వెళ్లడం సరికాదన్నారు. పోలీసు అధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకుని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా చూడాలని కోరారు.

పిహెచ్‌సిలో ప్రసవాల సంఖ్యను పెంచాలి : డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి-పీలేరు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాల సంఖ్యను పెంచేందుకు వైద్యులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమిష్టి కృషి చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కొండయ్య ఆదేశించారు. కంభంవారిపల్లె మండలం, గర్నిమిట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వగళ్ళ గ్రామపంచాయతీ నారమాకుల వడ్డిపల్లెలో గురువారం నిర్వహించిన 104 వాహన సేవలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనంలోని వైద్య పరికరాలను, మందులను, రిజిష్టర్లను పరిశీలించారు. అలాగే ఆ గ్రామ అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన వయోజన బి.సి.జీ. టీకాల సెషన్ను సందర్శించి అర్హులైన వారందరికీ టీకా అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం గర్నిమిట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి సిబ్బంది హాజరు పట్టికను, రోగుల నమోదును, కాన్పుల వివరాలను పరిశీలించారు. ల్యాబ్ లో మలేరియా, డెంగీ, హైరిస్కు గర్భవతులకు నిర్వహించిన రక్త పరీక్షలకు సంబంధించిన రికార్డులను, స్టోర్స్ లోని మందుల నిల్వ, నిర్వహణను తనిఖీ చేశారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ ఫీల్డ్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు వారి గ్రామాల పరిధిలోని గర్భవతులకు ప్రభుత్వం అందజేస్తున్న వివిధ పథకాల లబ్ధిని, సౌకర్యాలను తెలియజేసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కాన్పు చేయించుకునేందుకు వారిని ప్రోత్సహించాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్యురాలు డాక్టర్ అర్చన, సామాజిక ఆరోగ్య అధికారిణి భాగ్యలక్ష్మి, జిల్లా కార్యాలయ అధికారి లక్ష్మీనారాయణ, సీనియర్ అసిస్టెంట్ గిరిధర్ రెడ్డి, సూపర్వైజర్ పురుషోత్తం, ఆరోగ్య సిబ్బంది మైత్రి సుధా, అలేఖ్య, ఉమాదేవి, రమణి, స్వర్ణలత, 104 వాహన సిబ్బంది వెంకటరమణ, ధరణి, రెడ్డి మోహన్ పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని తనిఖీ చేస్తున్న డిఎంహెచ్ఒ